క్లుప్తంగా

వినికిడి లోపాన్ని ముందుగా గుర్తించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

రావికమతం: వినికిడి సమస్యను ముందుగా తల్లితండ్రులు గుర్తించినట్లయితే, ఆరేళ్లలోపు పిల్లలకు కాంక్లియర్ ఇంప్లాంటేషన్ ద్వారా లోపాన్ని సరిచేయవచ్చని హెచ్‌ఎం జయలక్ష్మి తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా మేడివాడ హైస్కూల్‌లో వినికిడి లోపం విద్యార్థులకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించి బహుమతులందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటువంటి పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తుందన్నారు. మండల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: గాదిరాయిలో గూట్ల నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, అతడి భార్య రాజుకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు శుక్రవారం వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారామ్ అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామినీ ఖాతాలో జమవుతాయని ఆయన తెలిపారు. సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పర్రె రామునాయుడు, ఆదాడ అప్పారావు, సలాది అచ్చింనాయుడు, సచివాలయ సిబ్బంది రమేష్, తదితర్లు పాల్గొన్నారు.

కొమిరలో ఘనంగా రామాలయ తీర్థం



సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

రావికమతం: కొమిరలో సీతారామాలయ తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకుడు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో 50 మంది దంపతులతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో విద్యుత్ అలంకరణలతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమములు ఏర్పాటు చేశారు.

గొట్టం పైపు తొలగించాలని ఫిర్యాదు



డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వేచలం ఆయికట్టు రైతులు

దేవరాపల్లి: వేచలం పంట కాలువలో అక్రమంగా వేసిన గొట్టం పైపు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ డి. అరుణ్‌చంద్రను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సాగునీటి కాలువలో అనధికారికంగా గొట్టం పైపు ఏర్పాటు చేసి పూడ్చడం వల్ల 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గొట్టం పైపు తక్షణమే తొలగించాలని విన్నవించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

మాడుగుల రూరల్: పశువులకు నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు మాడుగుల ఏరియా పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. గాలికుంటు వ్యాధి టీకాలు కార్యక్రమాన్ని శుక్రవారం కె.జె.పురంలో ఆయన ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తామన్నారు. తొలి రోజు కె.జె.పురం, పొంగలిపాకలో 142 పశువులకు టీకాలు వేసారు. పశువైద్య శాఖ సహాయకులు రమేష్, సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం

- పల్లె ప్రజలను ఆదుకుంటున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్
- సొంత గ్రామాల్లోనే పనులతోపాటు అభివృద్ధి
- లక్ష్యానికి మించి కూలీలకు అదనపు పని దినాలు
- ఏడాదిలో రూ.12.23 కోట్లు ఖర్చు



ఉపాధి పనులతో తవ్విన పొట్టిదొరపాలెం చెరువులో చేరిన వర్షం నీరు



భీమవరం చెరువులో పని చేస్తున్న కూలీలు

బుచ్చెయ్యపేట: రైతులకు ఉపాధి హామీ పథకం కొత్త ఊపిరిలందిస్తోంది. యంత్రాల వినియోగంతో వ్యవసాయ పనులు లేక పొట్టకూటి కోసం దూర ప్రాంతాలకు వలసపోతున్న వారికి వరదాయినిగా మారింది. స్వగ్రామాల్లోనే ఉండేలా వారికి ఉపాధి చూపిస్తోంది. దాంతో జీవనోపాధి పొందుతూ స్థానికంగా వనరులను బాగు చేసుకుంటున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 11,938 జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలకుగాను 21,938 మంది వేతనదారులు ఉన్నారు. రోజు 16,900 మంది కూలీలు ఆయా గ్రామాల్లో పలు రకాల ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. సాగునీటి చెరువులు, పంట కాలువల్లో పూడికతీత, మట్టి రోడ్లు, రైతుల పొలాల చుట్టూ గట్లు పటిష్టత, పండ్ల తోటలు పెంపకం, రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించి పెంచడం, చెక్ డ్యాంలు నిర్మాణం, కొండ ప్రదేశాల్లో నీరు నిల్వుండేలా నీటి గుంతలు, ట్రెంచ్‌లు తవ్వడం వంటి పలు రకాల ఉపాధి పనులు చేస్తున్నారు.

లక్ష్యానికి మించి పనిదినాలు...

ఈ ఏడాది మండలంలో వేతనదారులకు 4,61,471 పని దినాలు కల్పించాలని లక్ష్యం కాగా, ఇప్పటికే 4,76,010 పని దినాలను అధికారులు కల్పించారు. అదనంగా కూలీలకు పని దినాలు కల్పించి ఆదుకున్నారు. రోజుకు ఒక్కో కూలీకి సగటున రూ.195 వేతనం అందేలా చేశారు. ఇప్పటి వరకు కూలీలకు రూ.8.95 కోట్లు వేతనాల రూపంలో అందించగా, రూ.3.28 కోట్లు మెటీరియల్ పనులకు ఖర్చు చేశారు. బుచ్చెయ్యపేట మండలంలో అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు మొత్తం రూ.12.23 కోట్లు జాతీయ ఉపాధి హామీ పథకంలో ఖర్చు చేశారు. ఈ ఏడాది మండలంలో 1,701 పనులు చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటికే 217 పనులు పూర్తి చేయగా, 1,484 పనులు ఆఖరి దశకు చేరుకున్నాయి. అమృత సరోవర్ చెరువులు అభివృద్ధిలో భాగంగా పి. భీమవరం, పెదమదీన, దిబ్బిడి, కందిపూడి, ఆర్. శివరాంపురం గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేసి 2,500 ఎకరాలకు సాగునీరు అందేలా చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రోడ్ల వల్ల రైతులకు రవాణా కష్టాలు తొలగాయి. చెరువులు, చెక్ డ్యాంలు వల్ల పంటలకు సాగునీరు అందేలా చేయడమేగాక కొండ ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్న ట్రెంచ్‌లు వల్ల భూగర్భ జలాలు పెంపొందుతున్నాయి. ఉపాధి పథకంతో కూలీలకు పనులతోపాటు గ్రామాల్లో అభివృద్ధి సంతరించుకుంటుంది.

ఒక్కో కూలీకి రోజుకు రూ.257



జాబ్‌కార్డుదారులకు గ్రామంలోనే పని కల్పిస్తాం. దూర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా సొంత గ్రామంలోనే కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి పనులు చేసుకోవచ్చు. ప్రభుత్వ నిబంధనలు, కొలతల ప్రకారం పనులు చేస్తే ఒక్కో కూలీకి రోజుకు రూ.257 వరకు వేతనం అందిస్తాం.

– మురళీ, ఏపీవో, బుచ్చెయ్యపేట

తక్కువ బరువు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సుబ్బలక్ష్మి

దేవరాపల్లి: రక్తహీనత, బరువు తక్కువ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్‌వాడీ సిబ్బందికి ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి సూచించారు. ఈ మేరకు తామరబ్బ, నాగయ్యపేట అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారుల హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా చిన్నారులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైతే వైద్యులకు సమాచారం అందించాలని సూచించారు. తామరబ్బ పంచాయతీ సెక్రటరీ ఎల్. లింగన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజా పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు సేవలు విస్తృతం



గ్రామీణ బ్యాంకు మిత్ర పాయింట్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్ కృష్ణ

మాడుగుల: గ్రామీణ వికాస బ్యాంకు సేవలు ప్రతి పల్లెకు చేరువ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మాడుగుల గ్రామీణ వికాస్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ కృష్ణ తెలిపారు. సత్యవరంలో బ్యాంకు మిత్ర పాయింట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దీని ద్వారా సంక్షేమ పథకాల నగదుతోపాటు ఇతర లావాదేవీలు పొందవచ్చన్నారు. బ్యాంకు మిత్ర యడ్ల రామలక్ష్మి, బ్యాంకు సిబ్బంది రమణ, ఎంపీటీసీ తలారి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇందుకూరి నాగరాజు, చల్లా మహేశ్, యడ్ల మహేశ్, శనివాడ వెంకటరమణ, గోకాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యానికి గిరిజనుల తరలింపు



జాలంపల్లి నుంచి ఆస్పత్రికి బయలుదేరిన గిరిజనులు

మాడుగుల: సర్పంచ్ ధారా మల్లేశ్వరి ఆధ్వర్యంలో భీమునిపట్నం అనిల్ నీరుకొండ హాస్పిటల్‌కు శుక్రవారం ఉచిత బస్సుల్లో 75 మంది గిరిజన రోగులను తరలించారు. జాలంపల్లి పంచాయతీలో సిరిపురం, మల్లిపాడు, గొప్పూరు, గొప్పులపాలెం, చినపిట్టగెడ్డ, కొత్తపల్లి, కామకూటం, కొండవీధి, బుట్లజాలంపల్లి, నరసయ్యపేట గ్రామాల్లో రోగాలతో బాధపడుతున్న వారిని వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్తించారు. వారికి అక్కడ శస్త్రచికిత్సలు అవసరమైతే ఉచితంగా చేయించి తిరిగి అదే బస్సుల్లో వారి గ్రామాలకు చేర్చుతున్నారు. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పదిలో శత శాతం ఉత్తీర్ణతకు చర్యలు

ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల



నర్సీపట్నం: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని నర్సీపట్నం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.శ్యామల పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గతేడాది సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. సబ్ డివిజన్‌లో రావికమతం, కొత్తకోట, గొలుగొండ, వేములపూడి, నాతవరం, నర్సీపట్నం మొత్తం ఏడు వసతి గృహాల్లో 134 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పబ్లిక్ పరీక్షలకు నెల రోజులు గడువు ఉన్నందున తెల్లవారుజామున, రాత్రి సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఏబీసీడీ గ్రేడ్‌లుగా విద్యార్థులను విభజించామన్నారు. సి,డి గ్రేడ్ విద్యార్థులను ఎ,బి గ్రేడ్‌లకు తీసుకువచ్చేందుకు తర్ఫీదు ఇస్తున్నామన్నారు. దాతల సహకారంతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. వార్డెన్‌లు నిరంతరం వసతి గృహాల్లో అందుబాటులో ఉంటూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారన్నారు. తాను నిరంతరం సందర్శించి విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నానన్నారు.

స్త్రీలను గౌరవించడం మన విధి



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

చీడికాడ: నిరంతరం కుటుంబం కోసం శ్రమిస్తూ పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న స్త్రీమూర్తులును గౌరవించుకోవడం మన విధి అని విశాఖకు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తిపట్నాయక్ తెలిపారు. శుక్రవారం వరహాపురంలో మహిళలను దుశ్శాలువాలతో సత్కరించారు.

డీపీవో ఆకస్మిక పర్యటన

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల మేజర్ పంచాయతీలో శుక్రవారం డీపీవో ఆర్.శిరీషారాణి ఆకస్మికంగా పర్యటించారు. వెంకుపాలెం రహదారి పక్కనున్న డంపింగ్‌యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డుకు సంబంధించి కొత్తగా నిర్మించిన వాచ్‌మెన్ రూంను, నేమ్ బోర్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు స్థలం, పరిసరాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట భద్రత చేపట్టాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఈవో కె.శ్రీనివాసరావును ఆదేశించారు. బొజ్జన్న కొండకు వెళ్లే రహదారిలో టైర్ల పంక్చర్ షాపు నిర్వాహకుడు రోడ్డుపై అడ్డంగా టైర్లు పెట్టిన విషయాన్ని గమనించారు. వాటిని తొలగించాల్సిందిగా సిబ్బందిని సూచించారు. గతంలో కలెక్టర్ దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మళ్లీ యథాస్థితి కొనసాగడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉగాది కల్లా గృహ నిర్మాణాలు పూర్తి



సమావేశమైన మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు

రోలుగుంట: ఉగాది కల్లా జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయించాలని మండల ప్రత్యేకాధికారి బి.ప్రసాదరావు హౌసింగు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన సచివాలయ సహాయ ఇంజినీర్లతో సమీక్షించారు. సచివాలయాల పరిధిలో ఏ మేర గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్న విషయాలపై చర్చించారు. సచివాలయాల వారీగా నిర్మాణాలను పర్యవేక్షించి మెటీరియల్ అందించడంలో జాప్యం చేయొద్దని హౌసింగు ఏఈ ప్రేమానందంకు సూచించారు. ఎంపీడీవో కె.ప్రభాకర్రావు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ



సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన వైస్ ఎంపీపీ, కేతిరెడ్డి కుటుంబీకులు

రోలుగుంట: తన తండ్రి స్వర్గీయ కేతిరెడ్డి శ్రీను జ్ఞాపకార్థంగా తనయుడు సుధాకర్‌నాయుడు కుసుర్లపూడిలో అల్లూరి సీతారామరాజు నూతన విగ్రహాన్ని నిర్మించారు. దీనిని అతని కుటుంబీకులు అప్పలసీతయ్య నాయుడు, చినబాబు, కొమరవోలు ఎంపీటీసీ గొర్లె రామన్, మాజీ సర్పంచ్ గొర్లె చెల్లం నాయుడులతో కలిసి వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దింటమ్మ ఉత్సవాలు ప్రారంభం



పూజల్లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ సత్తిబాబు దంపతులు

రోలుగుంట: కుసుర్లపూడిలో ఐదు రోజులపాటు నిర్వహించే పెద్దింటమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని వేకువ జాము నుంచి దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ మద్దు అప్పలనాయుడు, ఎంపీపీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చుక్కా సత్తిబాబు దంపతులు, తదితరులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఉత్సవాలు ముగింపు రోజు వరకు ఉంటుందని ఉత్సవ కమిటీ చైర్మన్ తెలిపారు.

మాధవ్‌ను గెలిపించాలని అభ్యర్థన



రావికమతంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

రావికమతం: బీజేపీ బలపరిచిన సిట్టింగ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎన్ మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు అభ్యర్థించారు. రావికమతంలో శుక్రవారం వారు విస్తృత ప్రచారం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గల్లా రాజేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం సర్పంచ్‌కు డిప్యూటీ సీఎం పరామర్శ

దేవరాపల్లి: టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వెంకటరాజుపురం సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్ అలియాస్ చంద్రయ్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిని స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్‌కు ధైర్యం చెప్పి, అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, ఎం. అలమండ సర్పంచ్ దాడి జగన్, వీఆర్వో పోతల శంకరరావు ఉన్నారు.

వేడుకగా వెంకన్న కల్యాణోత్సవం



వెంకన్న కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం కమనీయంగా జరిగింది. ఈ సంవత్సరం ముత్యాల పెద్దియ్య దంపతులు ఈ వేడుక నిర్వహించారు. స్థానికులతోపాటు, మరివలస, బీబీ పట్నం, కొండపాలెం తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చిన కల్యాణ ఘట్టాన్ని కనులారా వీక్షించారు. ఆలయ అర్చకుడు రేజేటి సీతారామాచార్యుల అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఎం. కోడూరులో లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో అతి ప్రాచీనమైన లక్ష్మీనారాయణ స్వామివారి 33 వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామివారి కల్యాణం నిర్వహించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: ఉపాధి హామీ పథకంలో ఖర్చు చేసిన నిధులకు సామాజిక తనిఖీ 15వ రౌండ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఎస్‌ఆర్పీ, డీఆర్పీల ఆధ్వర్యంలో శనివారం నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు పర్యటిస్తారన్నారు. 2021 ఏప్రిల్ నుంచి గతేడాది మార్చి 31 వరకు మండలంలో ఖర్చు చేసిన రూ.18 కోట్ల ఉపాధి పనులకు సోషల్ ఆడిట్ చేస్తారన్నారు. 15రోజుల పాటు క్షేత్రస్థాయి పరిశీలించి లోపాలను ప్రజా వేదికలో బహిర్గతం చేస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సిమెంటు రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

మాడుగుల రూరల్: ఎం.కె.వల్లాపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కోట్ని లక్ష్మి శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కాకరి వారి కళ్లాల వరకు ఉపాధి హామీ పథకం నుంచి రూ.5 లక్షలతో 160 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు ఉప సర్పంచ్ కరణం రాము తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ కరణం రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామూర్తి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపునకు విస్తృత ప్రచారం

పట్టభద్రులకు వైఎస్సార్‌సీపీ శ్రేణుల అభ్యర్థన



దేవరాపల్లి గ్రంథాలయంలో యువకులను అభ్యర్థిస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి



మాడుగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్



మాకవరపాలెం: జి.కోడూరు హైస్కూల్లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ, తదితరులు

మాకవరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలంటూ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ పార్టీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం మాకవరపాలెం, గిడుతూరు, జి.కోడూరు ఉన్నత పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులు, ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు హరిబాబు, భద్రాచలం, పిళ్లా శ్రీను, బొడ్డేటి రమణ, మూకల బాలకృష్ణ పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని యువకులను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి కోరారు. సచివాలయ గ్రామ కన్వీనర్లు గొర్రుపోటు రమాదేవి, బంధం అప్పలరాజులతో కలిసి దేవరాపల్లిలో శుక్రవారం ప్రచారం చేశారు. స్థానిక గ్రంథాలయంలో యువకులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

కలిగొట్లలో..

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి, ఎంపీటీసీ రుత్తల లక్ష్మి కలిగొట్లలో ప్రచారం చేపట్టారు.

గొలుగొండ: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా జెడ్పీటీసీ సభ్యులు సుర్ల గిరిబాబు ఆధ్వర్యంలో చీడిగుమ్మల, ఎర్రవరం, పోలవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు. గొలుగొండ ఎంపీటీసీ, సర్పంచ్ చేపల చినపాప, కసిపల్లి అప్పారావుల ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ, గురుకుల కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు.

మాడుగుల: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ కోరారు. శుక్రవారం మాడుగులలో పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 1,541 పట్టభద్రుల ఓట్లు వేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ యడ్ల కళావతి, పార్టీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీసా, శానాపతి కొండలరావు, కోట్యాడ భాస్కరరావు, ఆడారి కన్నారావు, పెరుమాళ్ల వెంకట్రావు, బొద్దాపు భాస్కరరావు, కుక్కర శ్రీధర్, జవ్వాది వరహాలు, శ్రీనాథు జగ్గారావు, పర్రె రామునాయుడు, యడ్ల హేమంత్‌కుమార్, పోన్నవోలు సర్పంచ్ వి. ప్రభాకర్‌రాజు(చిన్ని) పాల్గొన్నారు.

రావికమతం: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ నాయకులు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, సచివాలయాల్లో శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, మలిచెట్ల గణేష్, పార్టీ మండల కార్యదర్శి శీలం శంకర్రావు పాల్గొన్నారు.

చీడికాడ: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా కోనాం, శిరిజాంలో సచివాలయ ఉద్యోగులను, ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యర్థించారు. మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఈర్లె చైతన్య, కోనాం సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మ అప్పలనాయుడు, నేతలు కసిరెడ్డి రామకృష్ణ, ఓ.డి.నాయుడు, చీడికాడ గ్రామ శాఖ అధ్యక్షుడు పరవాడ మహేష్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్య సేవలను అందిస్తున్న వైద్యాధికారి నిర్మల

మాడుగుల రూరల్/కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మాడుగుల మండలం వీరనారాయణంలో శుక్రవారం కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి శివప్రసాదుపాత్రుడు 162 మందికి వైద్య సేవలు అందించారు. కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెంలో 136 మందిని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు, దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. వైద్య సిబ్బంది రవికుమార్, పుష్పకాంతం, రమణమ్మ, సత్యవేణి, దేవి, డి.ఎస్.ఎన్.రాజు, కనకవేణి, ఆశ కార్యకర్తలు ఈశ్వరమ్మ, వరలక్ష్మి, లత పాల్గొన్నారు.